క్లుప్తంగా

50 మందికి ఉచిత వైద్య సేవలు



గన్నవరం: స్థానిక అవ్వాస్ మల్టీ స్పెషాలిటీ హస్పటల్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఈ.ఝాన్సీలక్ష్మి, డాక్టర్ వీ వెంకటేష్ నేతృత్వంలో ఛాతి, ఊపిరితిత్తులు, ఎలర్జి, షుగర్, మూత్రపిండాలు తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం రోగులకు ప్రత్యేక రాయితీపై మందులు పంపిణీ చేశారు. వైద్యులు మాట్లాడుతూ రోగులకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలందించడమే తమ లక్ష్యమన్నారు. ఆస్పత్రిని ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ క్యాంప్‌లో రోగులకు ఉచిత కన్సల్టెషన్, పీఎఫ్‌టీ, షుగర్, కిడ్నీలో రాళ్లు, కిడ్నీ మార్పిడి, మూత్ర సంబంధిత పరీక్షలు ఉచితంగా చేసినట్లు చెప్పారు. సుమారు 50 మంది వరకు ఉచిత వైద్య సేవలు పొందినట్లుగా తెలిపారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



ఉయ్యూరు: పేదల సంక్షేమమే ధ్యేయంగా ఆర్యవైశ్య సంఘం పనిచేస్తుందని ఆర్యవైశ్య యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేరెళ్ల తేజ అన్నారు. ఉయ్యూరు పట్టణంలోని యువజన సంఘం కార్యాలయంలో ఆర్యవైశ్య యువజన సేవాసంఘం, వాసవీ సేవాదళ్ సంయుక్త ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. నేరెళ్ల తేజ మాట్లాడుతూ సంఘ సభ్యులు సమష్టిగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. పేదలకు చేయూత ఇవ్వటమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు వెంట్రప్రగడ వీరాంజనేయులు, పి.నికిల్, కొల్లిపర హేమంత్, నేరెళ్ల వేణు, తదితరులు పాల్గొన్నారు.

హిందూత్వం పేరుతో గొడవలు సృష్టించే యత్నం

గన్నవరం: రాష్ట్రంలో మతవిశ్వాసాలను రెచ్చకొట్టేందుకు హైందవ శంఖారావం పేరుతో విశ్వహిందూ పరిషత్‌ను ముందు పెట్టి బీజేపీ వెనుక నుంచి నాటకాలు ఆడుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి వై. నరసింహా రావు విమర్శించారు. స్థానిక అట్లూరి శ్రీమన్నారాయణ మీటింగ్ హాలులో ఆదివారం సీపీఎం మండల స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసరపల్లిలో జరిగిన హైందవ శంఖారావం సభ ఉద్దేశం హిందూ తత్వాన్ని రెచ్చగొట్టడమేనని చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లోని హిందూ దేవాలయాల భూములు, ఆస్తులపై విశ్వ హిందూ పరిషత్ కన్నుపడిందన్నారు. వీటిని చేజిక్కించుకునేందుకే దేవాలయాలను హిందూ సమాజానికి అప్పగించాలని నినాదాన్ని ముందుకు తీసుకువచ్చారని ఆరోపించారు. అన్ని మతాల వారు కలిసిమెలసి ఉంటున్న రాష్ట్రంలో హిందూత్వం పేరుతో గొడవలు సృష్టించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. ఈ మతోన్మాద కుట్రలను ప్రజల్లోకి తీసుకువెళ్లి చైతన్యవంతులను చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. పార్టీ నేతలు కళ్లం వెంకటేశ్వరరావు, మల్లంపల్లి ఆంజనేయులు, అనుమోలు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఈ రోడ్డులో ప్రయాణం ప్రమాదమే

- అభివృద్ధికి దూరంగా మద్దూరు- ఉప్పలూరు రోడ్డు
- అధ్వానంగా ప్రధాన రహదారి
- రోడ్డంతా గోతులు, కోతకు గురైన మార్జిన్లు
- నరకప్రాయంగా రాకపోకలు



వణుకూరు- మద్దూరు మధ్య రాళ్లు తేలి ప్రమాదకరంగా రోడ్డు



మద్దూరు వద్ద కోతకు గురైన రోడ్డు మార్జిన్

కంకిపాడు: రోడ్డు అభివృద్ధికి గ్రహణం పట్టింది. రాళ్లు తేలి ప్రయాణం నరకప్రాయంగా సాగుతోంది. రోడ్డు మార్గంలో ఉన్న పెద్ద పెద్ద గోతులు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. మార్జిన్లు కోతకు గురై ఈ మార్గంలో ప్రయాణం అంటేనే వాహనదారులు భయపడిపోతున్నారు. రెండు మండలాల నుంచి సాగే మద్దూరు- ఉప్పలూరు రోడ్డుకు ఎప్పుడు మోక్షం లభిస్తుందోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

ఈ రోడ్డు కీలకం..

విజయవాడ- దివిసీమ కరకట్ట మార్గం నుంచి కంకిపాడు- గన్నవరం రోడ్డును ఉప్పలూరు వంతెన వద్ద తాకుతూ ఆర్అండ్‌బీ రోడ్డు మార్గం ఉంది. కంకిపాడు, పెనమలూరు మండలాల్లోని మద్దూరు, వణుకూరు, గోసాల, ఈడుపుగల్లు మీదుగా ఉప్పలూరు చేరుతుంది. అటు కరకట్ట మీదకు వెళ్లి విజయవాడ, దివిసీమ పరిసరాలకు వెళ్లాలన్నా, విమానాశ్రయం, ఏలూరు రోడ్డు నుంచి ప్రధాన పట్టణాలకు వెళ్లాలన్నా ఈ రోడ్డు మార్గాన్నే వాహనదారులు వినియోగిస్తున్నారు. ప్రధాన రోడ్డు మార్గాల్లో ఈ మార్గం ఉంది.

పెద్ద గోతులు..రాళ్లు తేలి ప్రమాదకరంగా..

ఏళ్ల తరబడి ఈ రోడ్డు మార్గం అభివృద్ధికి నోచుకోలేదు. రోడ్డు పొడవునా పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. రాళ్లు తేలిపోయి ఉంది. మార్జిన్‌కు కోతకు గురైపోయి ఉన్నాయి. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే సమయంలో వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. గోతుల కారణంగా తరచూ వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని, ద్విచక్ర, త్రిచక్రవాహనదారులు వాపోతున్నారు.

ఇసుక వాహనాలతో మరింతగా..

చిన్న పాటి చినుకు పడ్డా వణుకూరు- మద్దూరు మధ్యన రాకపోకలు సాగని దుస్థితి. ఆఖరికి బస్సు సర్వీసుల్లో వెళ్లే ప్రయాణికులు సైతం బస్సులు గోతుల కారణంగా ఒరిగిపోయి ఆందోళనకు గురైన పరిస్థితులు అనేకం. ప్రస్తుతం ఎడ్లబండ్లు, ట్రాక్టర్లలో ఇసుక తరలింపు యథేచ్ఛగా సాగుతోంది. వాహనాల రద్దీ కారణంగా రోడ్డు మరింత అధ్వానంగా తయారవుతుంది.

ఇటీవల ఒకరు మృతి..

ఇటీవల ఈడుపుగల్లు రోడ్డులో తెల్లవారుఝామున స్కూటీ అదుపుతప్పి పంట బోదెలోకి పల్టీకొట్టి స్కూటీ నడుపుతున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. దీన్ని బట్టి రోడ్డు మార్గంలో గోతులు ఎంత ప్రమాదకరంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

రూ.19 కోట్లు మంజూరైనా..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ రోడ్డు అభివృద్ధిపై ఎంతో శ్రద్ధ వహించింది. పూర్తి స్థాయిలో రోడ్డును అభివృద్ధి చేసేందుకు రూ.19 కోట్లపైగా నిధులను సమీకరించింది. నిధుల కేటాయింపులు జరిగి, అప్పటి మంత్రి జోగి రమేష్ చేతులమీదుగా ఈడుపుగల్లు వద్ద శంకుస్థాపన కూడా జరిగింది.

నిరాశపరిచిన 'పల్లె పండుగ'..

అయితే ఎన్నికల కోడ్ రావటంతో నిర్మాణ పనులు ముందుకు సాగలేదు. తరువాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో రోడ్డు అభివృద్ధి నిధుల అంశం అటకెక్కినట్లయ్యింది. పల్లె పండుగ కార్యక్రమంలో ఈ ప్రధాన రోడ్డుకు మోక్షం లభిస్తుందని అంతా భావించారు. కానీ జరగకపోవటంతో నిరాశ చెందారు. మంజూరైన నిధులను విడుదల చేయించి రోడ్డు అభివృద్ధి పనులను చేపట్టాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందని ప్రజలు సూచిస్తున్నారు.

తంబి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శం



దివ్య పూజాబలిని సమర్పిస్తున్న ఫాదర్ సూరేపల్లి ఐజక్

ఉంగుటూరు: తంబి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శం కావాలని, ప్రతి ఒక్కరూ క్రీస్తునందు నిరీక్షణ కలిగి జీవించాలని ఖమ్మం మేత్రాసనం కోశాధికారి ఫాదర్ సూరేపల్లి ఐజక్ అన్నారు. ఉంగుటూరు మండలం పెద్ద అవుటపల్లిలో బ్రదర్ జోసఫ్ తంబి 80వ వర్ధంతి మహోత్సవాలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న నవదిన ప్రార్థనలు ఆదివారం రెండో రోజు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఫాదర్లు పూజాబలిని సమర్పించి, నిరీక్షణ క్రైస్తవ జీవిత సత్యం గురించి బోధించారు. మనం జీవించే మంచి జీవితమును బట్టే పరలోక బహుమానం ఉంటుందన్నారు. తంబి ఎప్పుడు ఇతరుల రక్షణ కోసమే ప్రార్థన చేసేవారని చెప్పారు. పోపు, మేత్రానులు, గురువులు, కన్యాస్త్రీలపై కరుణ చూపించాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తంబి నగర్ సంఘస్తులు స్తుతి గీతాలతో కొనియాడారు. పుణ్యక్షేత్ర రెక్టర్ పాలడుగు జోసఫ్, విచారణ గురువు అభిలాష్ గోపు, సంఘస్తులు పాల్గొన్నారు.

అత్యాధునిక ఆవిష్కరణలతో మెరుగైన వైద్యం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న దృశ్యం

పెనమలూరు: వైద్యరంగంలో అత్యాధునిక ఆవిష్కరణలతో అత్యవసర సమయాలలో మెరుగైన వైద్య సేవలు అందించవచ్చని కామినేని ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ఆర్ఎస్.వర్ధన్ అన్నారు. కానూరు కామినేని ఆస్పత్రిలో ఆదివారం ఎమర్జెన్సీ చికిత్సల నిర్వహణపై అకడమిక్ సీఎంఈ ప్రోగ్రాంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వర్ధన్ మాట్లాడుతూ అత్యవసర సమయంలో ప్రతి క్షణం కీలకమన్నారు. ప్రభావితమైన చికిత్స అందించటం ద్వారా రోగి ప్రాణాలు కాపాడవచ్చని అన్నారు. సాంకేతిక సంపత్తి అందుబాటులో ఉంటే అత్యవసర పరిస్థితులను సక్రమంగా నిర్వహించగలుగుతామన్నారు. కామినేని ఆస్పత్రిలో అత్యవసర చికిత్సా విభాగంలో అంతర్జాతీయ స్థాయి వైద్య పరికరాలు, అనుభవజ్ఞులైన వైద్యులు ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టీవీ.నారాయణరావు, విశ్రాంత డీఎంఈ డాక్టర్ సూర్యశ్రీ, డాక్టర్లు పవన్‌కుమార్, వినతి, క్లస్టర్ హెడ్ సునీల్, పలువురు పాల్గొన్నారు.

వ్యాయామంతో ఎముకల ఆరోగ్యం



డాక్టర్ సాయికృష్ణను సన్మానిస్తున్న వాకర్స్

పెనమలూరు: ఎముకలు ఆరోగ్యంగా ఉండాలంటే శారీరక వ్యాయామం, ఆహారపు అలవాట్లు చాలా అవసరమని డాక్టర్ కాట్రగడ్డ సాయికృష్ణ అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్, వాకర్స్ క్లబ్, రియా ఆస్పత్రి ఆధ్వర్యంలో ఎముకల ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ సాయికృష్ణ మాట్లాడుతూ మనిషికి 50 సంవత్సరాల వరకు బోన్ మాస్ పెరుగుతుందని అన్నారు. ఆ తరువాత బోన్ మాస్ తగ్గటంతో ఆస్టియోపోరోసిస్ వ్యాధి వస్తుందన్నారు. దీంతో ఎముకలు బలహీనపడి దెబ్బతింటాయన్నారు. ఆడవాళ్లలో ఈ వ్యాధి వస్తుందన్నారు. దీని కారణంగా ఎత్తు తగ్గిపోవటం, నొప్పులు రావటం జరుగుతుందని వివరించారు. శారీరక వ్యాయామం, ఆహారపు అలవాట్లతో సమస్యను అధిగమించవచ్చన్నారు. ఈ సందర్భంగా వాకర్స్‌కు బోన్ సాంద్రత పరీక్షలు నిర్వహించారు. వాకర్స్ క్లబ్ సభ్యులు రూప్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, పలువురు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనం స్వాధీనం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని జక్కంపూడి కాలనీలో ఆదివారం రాత్రి గుట్టుచప్పుడు కాకుండా రేషన్ డిపో నుంచి బియ్యాన్ని తరలిస్తున్న వ్యాన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాలనీలోని బ్లాక్ నెం 245 రేషన్ డిపో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు నంబర్ ప్లేట్ లేని వ్యాన్‌లో బియ్యాన్ని తరలిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో సెక్టార్ ఎస్ఐ హుటాహుటిన కాలనీకి చేరుకునే సరికి బియ్యాన్ని తరలిస్తున్న వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వ్యాన్ నిండా బియ్యం ఉన్నట్లు గుర్తించారు. వ్యాన్ డ్రైవర్‌ను వివరాలు అడిగినా సమాధానం చెప్పకపోవడంతో వాహనాన్ని స్వాధీనం చేసుకుని పాల ప్రాజెక్టు క్వార్టర్స్‌లోని పోలీస్‌స్టేషన్‌కు చెందిన స్థలంలో భద్రపర్చారు.

నేడు 'డయల్ యువర్ ఈఈ'

ఉయ్యూరు: 'డయల్ యువర్ ఈఈ' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈఈ కృష్ణనాయక్ కోరారు. ఉయ్యూరు డివిజన్ పరిధిలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి సోమవారం ఉదయం 11 గంటల నుంచి ఒంటి గంట వరకూ కార్యక్రమం ఉంటుందన్నారు. 08676- 233718 నంబరుకు ఫోన్ చేసి వినియోగదారులు సత్వర పరిష్కారాలను పొందాలని సూచించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్ (ఈఎల్ఆర్)కు సహకరించాలని విద్యుత్‌శాఖ ఉయ్యూరు ఈఈ కృష్ణనాయక్ తెలిపారు. స్థానిక విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. గుడివాడ 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ నిమిత్తం ఈనెల 6, 7, 8 తేదీల్లో ఉయ్యూరు, తోట్లవల్లూరు మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఈఎల్ఆర్ అవసరాన్ని బట్టి ఇస్తామన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే క్షేమం



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ట్రాఫిక్ రూల్స్ పాటించడం అందరికీ క్షేమమని విజయవాడ పోలీస్ కమిషనరేట్ డీసీపీ (ట్రాఫిక్) కృష్ణమూర్తి నాయుడు చెప్పారు. నగరంలోని బందరురోడ్డులో జరుగుతున్న 35వ పుస్తక మహోత్సవ ప్రాంగణం దగ్గర కానూరులోని స్కాట్ స్ప్రైన్ అంతర్జాతీయ పాఠశాల, విజయవాడ సిటీ పోలీస్ కమిషనరేట్, రాయల్ ఎన్ ఫీల్డ్ సంయుక్తంగా రోడ్డు భద్రతపై వినూత్న అవగాహనా కార్యక్రమం ఆదివారం జరిగింది. కృష్ణమూర్తి నాయుడు మాట్లాడుతూ.. ద్విచక్రవాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలన్నారు.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శన..

ట్రాఫిక్ విభాగం అడిషనల్ డీసీపీ ఏవీఎల్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. స్కాట్ స్ప్రైన్ అంతర్జాతీయ పాఠశాల, రవీంద్ర భారతి స్కూల్స్ చైర్మన్ వీరమాచనేని వంశీకృష్ణ, అకడమిక్ డైరెక్టర్ వీరమాచనేని శాంతి, సీఈవో కొడాలి జాహ్నవి, ప్రిన్సిపాల్ చలసాని ప్రతిమ, వైస్ ప్రిన్సిపాల్స్‌తో పాటుగా ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులు ప్రదర్శించిన నాటకం ఆకట్టుకుంది. పలు పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు.

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో 1999- 2000 బ్యాచ్ విద్యార్థులు

గన్నవరం: స్థానిక వీఎస్.సెయింట్‌జాన్స్ మాధ్యమికోన్నత పాఠశాలలో ఆదివారం 1999- 2000 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. పాఠశాలలో పదో తరగతి పూర్తిచేసుకున్న పూర్వ విద్యార్థులు పాతికేళ్ల తర్వాత తిరిగి ఒకే వేదికపై కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ గతాన్ని గుర్తుచేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. అప్పటి గురువులకు ఆత్మీయ సన్మానం చేసి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ ఇక్కడ చదువుకున్న పూర్వ విద్యార్థులు దేశవిదేశాల్లో ఉన్నత స్థాయిలో ఉండడం గర్వకారణంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థులు పాఠశాలకు విలువైన ఆస్తిగా ఆయన పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధిలో, సమాజ అభ్యున్నతికి వారు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడు కె.వాసు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ వై.హరివిశ్వనాథ్, ప్రధాన కార్యదర్శి బీ నరేంద్రకుమార్, రెవ.బ్రదర్లు కేఎం.జోసఫ్, బాలశౌరి, జిమ్మి కురియాకోస్, భల్లా జోసఫ్, జయబాలన్ తదితరులు పాల్గొన్నారు. తొలుత విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

100 మంది వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



ఉప్పలూరులో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న పూర్వ విద్యార్థులు

కంకిపాడు: పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఉత్సాహంగా సాగింది. 1983- 84 విద్యా సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థులు ఉప్పలూరు గ్రామంలో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. స్నేహితులు అంతా ఒక చోట చేరి ఆత్మీయంగా పలకరించుకున్నారు. 100 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు అన్నే ధనయ్య, చలసాని రాధాకృష్ణమూర్తి, వెంగల కోటయ్యస్వామి, వెంగల రమేష్, ఉప్పలూరు భాస్కర్, పల్లపు మాధవరావు, శ్రీకాకుళపు రమణ, నెరుసు రమేష్, లాం ఇశ్రాయేలు, నాగశ్రీను, అన్నే శ్రీనివాస్, కొండేటి లక్ష్మణరావు, గోగులమూడి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

'కమ్మసేవా సమితి' సంక్రాంతి సంబరాలు



కన్నయ్యనాయుడును సన్మానిస్తున్న నిర్వాహకులు

పెనమలూరు: కమ్మవారి సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్‌కాలేజీలో పల్లె వాతావరణం ఉట్టిపడేలా సంక్రాంతి సంబరాలు జరిపారు. రంగవల్లులు, గంగిరెద్దుల విన్యాసాలు, తీన్మార్ డప్పులు, ముగ్గులు, ఇతర పలు రకాల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ జలవనరుల శాఖ సలహాదారుడు నాగినేని కన్నయ్యనాయుడు మాట్లాడుతూ నీరు సమృద్ధిగా ఉంటేనే రైతులు పంటలు పండించగలుగుతారన్నారు. తాను అనేక ప్రాజెక్టుల నిర్మాణానికి కృషి చేశానని తెలిపారు. పేదరిక నిర్మూలన రైతుల వల్లే సాధ్యమవుతుందని వివరించారు. పలువురు ప్రముఖులు మాట్లాడుతూ రైతులు ఆనందంగా జరుపుకొనేది సంక్రాంతి పండుగన్నారు. కమ్మవారి సేవామితి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా చదువు, హాస్టల్ వసతి కల్పించామని నిర్వాహకులు తెలిపారు. ఎమ్మెల్యేలు సుజనాచౌదరి, బోడె ప్రసాద్, తానా మాజీ అధ్యక్షుడు కోమటి జయరామ్, కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ అధ్యక్షుడు జెట్టి కుసుమకుమార్, ప్రముఖులు సజ్జా కిషోర్ బాబు, కొసరాజు కోటేశ్వరరావు (కేకేఆర్), అంతర్జాతీయ టెన్నిస్ క్రీడాకారుడు మైనేని సాకేత్, వెలగపూడి గోపాలకృష్ణప్రసాద్, దేవినేని లక్ష్మిదేవి, ఆలూరి బాలవెంకటేశ్వరరావు, గన్ని భాస్కరరావు పలువురు పాల్గొన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద ఎత్తున కమ్మ సంఘీయులు పాల్గొన్నారు.

కోడి పందేలకు సిద్ధమవుతున్న బరులు

- ఎనికేపాడు, రామవరప్పాడులో సిద్ధమవుతున్న బరులు
- కొత్త సంస్కృతి ఆరంభిస్తున్న నేతలు



ఎనికేపాడు హెచ్‌పీ పెట్రోల్ బంక్ వెనుక పొలాల్లో సిద్ధమవుతున్న కోడి పందేల బరి

రామవరప్పాడు: గత 30 సంవత్సరాలుగా జూద సంస్కృతికి దూరంగా ఉన్న గ్రామాల్లో టీడీపీ నాయకులు జూద క్రీడలకు తెరలేపుతున్నారు. సంక్రాంతి పండుగ మాటున ధనార్జనే ధ్యేయంగా కోట్లు చేతులు మారే కోడి పందేలు, జూద క్రీడలు నిర్వహించడానికి సన్నహాలు చేస్తున్నారు. దీనికి సంబంధించి వివరాలు ఇవీ..

30 ఏళ్లలో ఎప్పుడూ లేదు..

విజయవాడ రూరల్ మండలానికి ఒక పక్కగా ఉన్న రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లో గత 30 సంవత్సరాలుగా ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉన్నా కోడి పందేలు ఏర్పాటుకు బరులను ఏర్పాటు చేయలేదు. ఈ గ్రామాలన్నీ ఒకే మాటపై జూద సంస్కృతికి దూరంగా ఉంటూ వచ్చారు.

ఆనవాయితీకి తిలోదకాలిస్తూ..

ఈ ఆనవాయితీకి తిలోదకాలిస్తూ రామవరప్పాడు ఫ్లైఓవర్ సమీపంలో, ఎనికేపాడులో కోడి పందేల బరులను ఏర్పాటు చేయడానికి టీడీపీ నాయకులు పొలాలను సిద్ధం చేస్తుండటంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చకచకా ఏర్పాట్లు..

రామవరప్పాడు రెండో ఫ్లైఓవర్ సమీపంలోని పొలాల్లో, ఎనికేపాడు 100 అడుగుల రోడ్డులో హెచ్‌పీ పెట్రోల్ బంక్ వెనుకగా ఉన్న పొలాల్లో కోడి పందేల నిర్వహణకు బరుల ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎనికేపాడులో గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, మాజీ సర్పంచ్‌కు, అతని సోదరుడికి చెందిన 10 ఎకరాల పొలంలో పందేలు నిర్వహించడానికి సిద్ధం చేస్తున్నారు. తాజాగా ఈ పొలంలో శంకుస్థాపన కార్యక్రమాన్ని కూడా పూర్తి చేశారు.

జూద క్రీడలు కూడా?

ఈ బరిలో కోడి పందేల పాటు పలు జూద క్రీడలను నిర్వహించనున్నట్లు సమాచారం. రామవరప్పాడు ఫ్లైఓవర్ సమీపంలో మరో 10 ఎకరాల్లోని పొలాలను ఇప్పటికే బుల్డోజర్లతో చదును చేయిస్తున్నారు. టీడీపీ నాయకులు స్థానిక నియోజకవర్గ ప్రజాప్రతినిధి కనుసన్నల్లో సిండికేట్లుగా మారి ఈ బరులను నిర్వహిస్తున్నట్లు సమాచారం.

స్టాళ్ల నిర్వహణకు పోటీ..

ఈ జూద స్టాళ్ల నిర్వహణ కోసం ఇప్పటి నుంచే పోటీ ప్రారంభమైంది. మూడు రోజుల పాటు నిర్వహించే జూద క్రీడలకు గాను ఒక్కో స్టాల్ నుంచి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ బరుల అనుమతుల కోసం పోలీసులు, ఇతర శాఖల అధికారులను ప్రసన్నం చేసుకునేందుకు పెద్ద మొత్తంలో చేతులు మారుతున్నాయని పలువురు బహిరంగంగానే చెబుతున్నారు.

ఆలోచించాలని వినతి..

గత 30 సంవత్సరాలుగా ఇటువంటి సంస్కృతికి దూరంగా ఉన్న గ్రామాల్లో బరుల ఏర్పాటుకు పలు గ్రామస్తులు అభ్యంతరం వెలిబుచ్చుతున్నారు. నివాసాలకు సమీప గ్రామాల్లో అనుమతులు నిరాకరించాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు.

మెకానిక్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి



ఉయ్యూరు: మెకానిక్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి ప్రభుత్వం భద్రతా, సంక్షేమ చర్యలు చేపట్టాలని టూవీలర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దాయనేని ధర్మారావు అన్నారు. ఉయ్యూరు పట్టణంలోని కాపు కల్యాణ మండపంలో కృష్ణా జిల్లా టూ వీలర్స్ అసోసియేషన్ 13వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ధర్మారావు మాట్లాడుతూ 50 ఏళ్లు నిండిన లబ్ధిదారులకు పింఛను ఇవ్వాలన్నారు. ప్రమాద, ఆరోగ్య బీమా పథకాలను అమలు చేయాలన్నారు. మెకానిక్‌లకు పరికరాలు కొనుగోలు చేసేందుకు రుణ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని వృత్తినైపుణ్యతతో ఆర్థిక ప్రగతి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎండీ అక్బర్ బాషా, ఉయ్యూరు అధ్యక్షుడు ఎం.జగన్నాథం, కార్యదర్శి ఇబ్రహీం, ప్రతినిధులు అంకాల సుబ్బారావు, ఎం.వెంకటేశ్వరరావు, ఖాన్ పాల్గొన్నారు.